ప్రజాశక్తి

గురువారం 15 ఆగస్టు 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





పారిశ్రామిక వృద్ధికి చర్యలు ప్రకటించేనా?

- నేడు కృష్ణాజిల్లాలో మొదటిసారిగా చంద్రబాబు పర్యటన
- రహదారుల అభివృద్ధికి ఎదురుచూస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం తొలిసారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం కృష్ణాజిల్లాలో పర్యటించనున్నారు. గుడివాడలోని తుమ్మలరామబ్రహ్మం పార్కులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఆయన మధ్యాహ్నం 12.35 గంటలకు ప్రారంభిస్తారు.

జిల్లా అభివృద్ధికి చర్యలు ప్రకటించేనా?

కృష్ణాజిల్లాలో టిడిపి కూటమి క్లీన్ స్వీప్ చేసింది. ఈ క్రమంలో ప్రతిష్టాత్మకమైన గుడివాడ అసెంబ్లీ స్థానాన్ని టిడిపి కైవసం చేసుకుంది. చంద్రబాబుపై నిత్యం విమర్శలు చేస్తూ వార్తల్లో ఉంటూ నాలుగు పర్యాయాలు ఆ నియోజకవర్గం నుంచి వరుస విజయాలు సాధించిన కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) గుడివాడలో ఓటమి పాలయ్యారు. ఎట్టకేలకు టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ సొంత నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి వెనిగండ్ల రాము విజయం సాధించారు. ఎన్నికల తర్వాత చంద్రబాబు తొలిసారిగా గుడివాడ రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. గతంలో నిర్లక్ష్యం చేసిన అభివృద్ధి (మిగతా 2లో)



మచిలీపట్నం - రేపల్లె రైల్వేలైన్ ఏర్పాటు చేయండి

రైల్వే మంత్రికి రాష్ట్ర మంత్రి కొల్లు వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా ప్రజల దశాబ్దాల కోరికగా మిగిలిపోయిన మచిలీపట్నం - రేపల్లె మధ్య 45 కిలోమీటర్ల రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో రైల్వే మంత్రిని కొల్లు రవీంద్ర కలిసి ఈ మేరకు విజ్ఞాపపత్రం అందజేశారు. ఈసందర్భంగా మంత్రి కొల్లు మాట్లాడుతూ దశాబ్దాలుగా మచిలీపట్నం ప్రాంత వాసుల కోరిగా ఉన్న ఈ రైల్వేలైన్ కోసం (మిగతా 2లో)

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కార్మికురాలు మృతి : 8 మందికి తీవ్ర గాయాలు

వార్త 4లో

మాజీ ఎంఎల్ఎ వంశీకి ఊరట

20 వరకు ఎలాంటి చర్యలు చేపట్టొద్దని హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - గన్నవరం : కృష్ణాజిల్లా గన్నవరం మాజీ ఎంఎల్ఎ వల్లభనేని వంశీమోహన్‌కు హైకోర్టులో ఊరట లభించింది. గన్నవరంలోని టిడిపి కార్యాలయం ధ్వంసం కేసులో ఆయన 71వ నిందితుడుగా ఉన్నారు. దీంతో ఆయన ముందస్తు (మిగతా 2లో)

సిపిఎం నుండి ఆర్.రఘు బహిష్కరణ

వార్త మెయిన్‌లో

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - గుడివాడ : కృష్ణాజిల్లా గుడివాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న అన్న క్యాంటీన్‌ను బుధవారం కలెక్టర్ డికె.బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుడివాడ ఎంఎల్‌ఎ వెనిగండ్ల రాము పరిశీలిం చారు.



ఈసందర్భంగా ఎంఎల్‌ఎ విలేకర్లుతో మాట్లాడుతూ సిఎం అయిన తర్వాత తొలిసారి గుడివాడ వస్తున్న చంద్రబాబుకు గుడివాడ ప్రత్యేకతను చాటి చెప్పేలా ఘన స్వాగతం పలుకుతామన్నారు. గుడివాడలో అన్న క్యాంటీన్ పున: ప్రారంభం కావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, దింట్యాల రాంబాబు పాల్గొన్నారు.

చట్టాలు మారకుండా సహకారాభివృద్ధి అసాధ్యం

ఆర్‌బిఐ డైరెక్టర్ సతీష్ కె.మరాఠే

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దేశంలో సహకార వ్యవస్థ ఆశించిన రీతిలో అభివద్ధి చెందడం లేదనీ, దీనికి ఒకే ఒక్క ప్రధాన కారణం సహకార చట్టమేనని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) డైరెక్టర్, సహకార భారతి పూర్వ అధ్యక్షులు సతీష్ కె.మరాఠే అన్నారు. సహకార భారతి ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యాన జరిగే ఓ సదస్సులో పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన ఆయన.. సహకార భూమి జర్నల్ సహకార సంఘం కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. తొలుత ప్రఖ్యాత సహకారవాది వైకుంఠ మెహతా చిత్రపటాన్ని ఆవిష్కరించారు. సహకార పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా సహకారభూమి, నగరంలోని వివిధ సొసైటీల సభ్యులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సహకారభూమి జర్నల్ చైర్మన్, గౌరవ సంపాదకులు దాసరి కేశవులు, కార్యదర్శి వీరమాచనేని రత్నప్రసాద్, సహకార ధర్మపీఠం (హైదరాబాద్) అధ్యక్షులు, ప్రముఖ సహకారవాది సంభారపు భూమయ్య, సంపాదకుడు అక్బర్ పాషా, సంపాదకవర్గ సభ్యులు కానూరి వెంకట కష్ణ, చావా రవి పాల్గొన్నారు.

దేశ సమగ్రత బాధ్యత యువతదే : కలెక్టర్ సృజన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఎందరో మహానుభావులు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడవలసిన బాధ్యత యువతపై ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. ప్రతి ఇంటిపై జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటడంతో పాటు జాతీయ జెండా ప్రతిష్టను మరింత ఇనుమడింప చేద్దామన్నారు.



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా విజయవాడ మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సజన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో సబ్ కలెక్టర్ బీహెచ్. భవాని శంకర్, డిఆర్వో వి. శ్రీనివాసరావు, తహసీల్దార్లు ఆర్.వివి రోహిణి దేవి, సిహెచ్. శిరీష, సూర్యారావు, ఇంతియాజ్ పాషా, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. భాగ్యలక్ష్మి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డి డాక్టర్ వెలగా జోషి, నెహ్రూ యువక కేంద్ర కో- ఆర్డినేటర్ ఎస్.రామ్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్ పాల్గొన్నారు.



సత్యనారాయణపురంలో తిరంగా రన్

ప్రజాశక్తి - విజయవాడ : సత్యనారాయణపురంలోని ఎకెటిపిఎంసి ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు బుధవారం తిరంగా రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, జాయింట్ కలెక్టర్ నిధి మీనా పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ టు కమిషనర్‌తోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంగిశెట్టి శ్రీనివాసరావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ మామిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు పెరేడ్ గ్రౌండ్ ముస్తాబు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి : స్వాంతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. ఇందుకుగాను అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. గురువారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. 9.10 గంటలకు పోలీసులచే గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.15 గంటలకు వేడుకలనుద్దేశించి మంత్రి సందేశం ఇస్తారు. 9.35 గంటలకు వివిధశాఖల శకటాల ప్రదర్శన ఉంటుంది. 10.40 గంటలకు వివిధ శాఖల స్టాల్స్‌ను మంత్రి సందర్శిస్తారు.

మొదటిపేజీ తరువాయి

పారిశ్రామిక వృద్ధికి చర్యలు ప్రకటించేనా?

కార్యక్రమాలను టిడిపి ప్రభుత్వం ముందుకు తీసుకు వెళ తుందని జిల్లా, గుడివాడ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లా అభివృద్ధిపై ఏ మేరకు చర్యలు తీసుకుంటారోనని ప్రజలు ఎదురుచేస్తున్నారు. సమస్యలు ఇలా !

జిల్లాలో బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వీటి నిర్మాణాలను వేగవంతం చేయడంతోపాటు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి గురించి ఎక్కువగా చర్చ జరుగుతోంది. పారిశ్రామిక ఉత్పత్తుల రవాణాకు మెరుగైన రహదారులు అవసరం. జిల్లాలో ఆర్‌అండ్ బి రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గుడివాడ-కంకిపాడు రోడ్డుకు మోక్షం కలుగుతుందేమోనని ఎదురుచూస్తున్నారు. ఈ రోడ్డును గుడివాడ పట్టణం చివరి వరకు నిర్మించారు. దీనికి కొనసాగింపుగా రూ.5 కోట్లతో ఏడు కిలో మీటర్లు నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయి. మరో 16 కిలో మీటర్ల రోడ్డు అత్యవసర మరమ్మతులు చేయడానికి రూ.1.80 కోట్లు మంజూరైనా టెండరు దాఖలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. రోడ్డుకు ఇరువైపులా కాల్వలు ఉండటంతో ఈ రోడ్డు ఎప్పటికప్పుడు కుంగిపోతోంది. ఈ పరిస్థితిని నివారించడానికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాల్వలకు రివిట్‌మెంట్ నిర్మించి ఆ తర్వాత రోడ్డును ఆధునీకరించాల్సి ఉంది. గుడివాడ-పామర్రు- చల్లపల్లి రోడ్డు 20 కిలో మీటర్లు అధ్వానంగా మారింది. ఈ రెండు రోడ్లను జాతీయ రహదారులుగా మార్చాలనే ప్రతిపాదన ఉన్నా ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. అవనిగడ్డ-కోడూరుతోపాటు అనేక రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గుడివాడ పారిశ్రామికవాడలోనూ సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ నూతన పారిశ్రామికవాడకు మరో 30 ఎకరాలు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. గుడివాడలో టిడ్కో లబ్ధిదారులకు రుణాలు భారంగా మారాయి. ప్రభుత్వం బాధ్యత తీసుకుని లబ్ధిదారుల రుణ సమస్యను పరిష్కరించాలనే డిమాండ్ ఉంది. దివి తాలూకాలో ఎదురుమొండి దీవుల వద్ద వంతెన నిర్మాణం ప్రతిపాదనల్లోనే ఉంది. ఈ వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. అలాగే బాపులపాడు మండలం మల్లవల్లిలో 1300 ఎకరాల్లో మోడల్ పారిశ్రామిక పార్కు, 100 ఎకరాల్లో ఫుడ్‌పార్కులు ఏర్పాటు చేసినా పరిశ్రమల ఏర్పాటుకు ఎవరూ ముందుకు రావడంలేదు. చంద్రబాబు పర్యటనలో ఈ సమస్యల పరిష్కారంతోపాటు జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల వేగవంతానికి అవసరమైన నిధులు కేటాయిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

మచిలీపట్నం - రేపల్లె రైల్వేలైన్ ఏర్పాటు చేయండి

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. దశాబ్దాల క్రితమే అంతర్జాతీయ వాణిజ్య వ్యాపార రంగాల్లో ఈ ప్రాంతం కీలకంగా వ్యవహరించిందని గుర్తుచేశారు. ఈ మార్గం పూర్తయితే చెన్నై - కోల్‌కతా మార్గంలో చాలా వరకు ట్రాఫిక్ రద్దీతోపాటు 100 కిలోమీటర్లకు పైగా దూరం కూడా తగ్గుతుందన్నారు. ప్రత్యేకంగా సరుకు రవాణా రైళ్లను విజయవాడ వైపు కాకుండా మచిలీపట్నం వైపుగా మళ్లించడం ద్వారా విజయవాడ రైల్వేస్టేషన్ రద్దీ కూడా తగ్గించుకునే అవకాశం ఉంటుందన్నారు. పశ్చిమ గోదావరి, కష్ణా, గుంటూరు, ఒంగోలు జిల్లాల పరిధిలోని ప్రజలకు ప్రయాణం సులువుగా మారుతుందన్నారు. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తే ఎగుమతుల ద్వారా ఆదాయం కూడా ఆశించిన మేర లభిస్తుందని అన్నారు. ప్రత్యేకంగా మత్స్య ఎగుమతులు ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయన్నారు. పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.

మాజీ ఎంఎల్‌ఎ వంశీకి ఊరట

బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈనెల 20వ తేదీ వరకు వంశీపై ఎలాంటి చర్యలు తీసు కోవద్దని కోర్టు ఆదేశించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను కోరింది. ఈ కేసులో ఇప్పటికే గన్నవరం పోలీసులు 25 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అనంతరం వారిని గన్నవరం, నూజివీడు, నెల్లూరు సబ్ జైళ్లకు తరలించారు. ఈ కేసులో మరికొందరు ముందస్తు బెయిల్‌కు పిటిషన్లు దాఖలు చేశారు.

మురుగునీటిలోనే జీవనం

- డ్రైనేజీల్లో నీరుపారక దోమల విజృంభణ
- పెడనలో అస్తవ్యస్తంగా పారిశుధ్యం



రోడ్లపై జీవనాన్ని కొనసాగిస్తున్న దృశ్యం



ప్రజాశక్తి-పెడన : ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాన్ని అంగ రంగ వైభవంగా జరుపుకుంటున్నాం. నాయకులు, అధికారులు రాష్ట్ర ప్రగతి పథంలో పరుగులు పెడుతుందంటూ ప్రసంగాలు ఉదరగొట్టడం తప్ప ఆచరణ మాత్రం శూన్యం. పెడన మున్సిపాలిటీలోని 19, 20, 21, 23 వార్డులోని నిల్వ ఉన్న మురుగునీరే ఇందుకు నిదర్శనం. గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలకు మున్సిపాలిటీ పరిధిలోని మేజర్, మైనర్ డ్రైనేజీల్లో పూడికతీత తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే తిష్ట వేసింది. స్థానిక 19 వార్డులోని గణేష్ నగర్ నుంచి దక్షిణ తెలుగు పాలెం వెళ్ళు రోడ్డులో యానాదుల పూరి గుడిసెలు గత రెండు నెలలుగా మురుగు నీటిలోనే మగ్గుతు న్నాయి. చేసేది లేక వారు ఆ గుడిసెలను ముందున్న రోడ్డుపైనే జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అంతే కాకుండా రామలక్ష్మి కాలనీలో అభయాం జనేయ ఆలయం వద్ద దాదాపు 8 ఎకరాల్లో ఖాళీ స్థలంలో మురుగునీరు చేరి చెరువులను



మురుగునీటిలో మగ్గుతున్న దృశ్యం

తలపిస్తున్నాయి. అలాగే బ్రహ్మపురం, పైడమ్మ కాలనీ, రామలక్ష్మి కాలనీల్లోని రోడ్ల పైకి సైతం మురుగునీరు చేరింది. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగిన మున్సిపల్ సమావేశంలో మురుగు కాలువలోని సీల్టును తొలగించేందుకు తొమ్మిది లక్షలు పాకింగ్స్ స్ప్రేయర్లు 50 వేలు, మలేరియా ఆయిల్స్ మరియు బైటెక్ వగైరా కొనుగోలు చేసేందుకు, సీజనల్ వ్యాధులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకునేందుకు ఇలా దాదాపు 15 నుంచి 20 లక్షల చూపాయలకు పైగా నిధులను కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. కానీ వీటిని ఎక్కడ అమలు చేయలేదనడానికే ఈ చిత్రాలే నిలువెత్తు నిదర్శనాలు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కార్యాలయాల్లోని కుర్చీలు విడిచి వార్డుల్లో పర్యటించి మురుగునీటిని యంత్రాల ద్వారా తోడుతారు లేదు అన్నది వేచి చూడాల్సిందే.



నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు సంఘటితంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ వ్యవస్థాపక అధ్యక్షులు గొల్లపూడి మోహన్ రావు తెలిపారు. బుధవారం అవనిగడ్డ నియోజకవర్గం నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలకు ఆప్సా డెమొక్రటిక్ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం పదో తరగతిలో ప్రైవేటు స్కూల్ టీచర్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు వివిధ సబ్జెక్టులకు బోధన విషయంలో నిపుణుల ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికలలో అవనిగడ్డ నియోజకవర్గం ఆఫీసర్ డెమోక్రటిక్ గౌరవాధ్యక్షులు చన్నంశెట్టి కష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల్లో నియోజకవర్గస్థాయి అధ్యక్షులుగా విశ్వం శెట్టి శివ నాగరాజు. ఉపాధ్యక్షులుగా ఎస్ శామ్యూల్. కార్యదర్శిగా పి సునీల్ కుమార్. ఉప కార్యదర్శిగా పి మైసయ్య. ట్రెజరర్ గా కె ఎస్ ఆర్ కే డి ప్రసాద్ ఈసీ మెంబర్లుగా ఆర్ వసుంధర దేవి సిహెచ్ హరినారాయణులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక కాబడిన నూతన కమిటీతో చన్నంశెట్టి కష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో అప్స డెమొక్రటిక్ ఎలక్షన్ కమిటీ సభ్యులు ఎం శ్రీనివాసరావు, కే ఈశ్వరరావు, ఏ శేషు బాబు, డి మురళీకష్ణ లతోపాటు వివిధ మండలాల్లోని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో మత్తు పదార్థాల వాడకం నుండి భారత్ విముక్తిపై అవగాహన వాక్ థాన్ బుధవారం నిర్వహించారు. ముందుగా కళాశాల విద్యార్థినీ విద్యా ర్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మానవ హారంగా ఏర్పడగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ వారిచే డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డాక్టర్ బుర్రా కరుణ కుమార్ మాట్లాడుతూ, ప్రమాదకర డ్రగ్స్ మాయలో పడి యువత వారి శక్తి యుక్తులను నాశనం చేసుకుంటుందని ఆవేదన చెందారు. ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్ కు, డ్రగ్స్ వాడకానికి దూరంగా ఉండి దేశాభివద్ధిలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని సూచించారు. 16 ఆంధ్ర బెటాలియన్ యూనిట్ మచిలీపట్నం నుండి ఎన్.సి.సి., పి.ఐ స్టాఫ్ రాజ్ సింగ్, ప్రవీణ్ కుమార్‌లు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాల్గొని కళాశాల ప్రాంగణంలో కార్యక్రమానికి మద్దతుగా మొక్కలు నాటి దేశభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి. కోదండ రామారావు, డాక్టర్ ఎం. ఆర్. సి. హెచ్. శాస్త్రి, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి. రవీంద్ర బాబు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం. శివ శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : బాలల హక్కుల పరిరక్షణ అందరి భాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయ మూర్తి కె. వి. రామకష్ణయ్య పేర్కొన్నారు. స్థానిక పిఎమ్ శ్రీ కేంద్రీయ విద్యాలయంలో బుధవారం లీగల్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ బాల, బాలికల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోకూడాదన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలను వినియోగిం చరాదన్నారు. 14 ఏళ్ల లోపు వయస్సు గల విద్యార్థులు బడిలోనే ఉండాలని పని లో కాదన్నారు. ఇలా పలు బాలల చట్టాలు, హక్కులు గురించి. వివరించారు.కార్యక్రమంలో పిఎమ్ శ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీ మహ్మద్ అసీఫ్ హుస్సేన్, హెచ్ఎమ్ జె. గ్లోరీ స్వరూప రాణి, పీజీటీ లు జె సత్యన్నారాయణ, రెమ్యా, మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులు సిహెచ్ ముసలయ్య, అజ్మతున్నిసా, ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహక బహుమతి అందజేత

ప్రజాశక్తి-ఉయ్యూరు : విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి, పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని పేరు ప్రఖ్యాతులు గడించాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు సీహెచ్ నాగసుబ్రమణ్యం అన్నారు. బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మద్రివాడకు చెందిన యార్లగడ్డ భావనకు తుమ్మల హిమకరబాబు, భాగ్యలక్ష్మి దంపతులు ఆర్థిక సాయంతో రూ. 10వేలు నగదు ప్రోత్సాహక బహుమతి రోటరీక్లబ్ ద్వారా బుధవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉన్నత చదువులకు మెరిట్, పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ రోటరీక్లబ్ ద్వారా ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమన్నారు. విద్యాభివద్ధికి ఉయ్యూరు రోటరీక్లబ్ తనవంతు సేవలం దిస్తుందన్నారు. కేసీపీ డీజీఎం ఎస్. సంపత్కుమార్, సయ్యద్ అనీస్, అమీర్ మీర్జా, ఎంబివి ప్ర సాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



17న అరుణాచలంకు బస్సు

ప్రజాశక్తి-ఉయ్యూరు : శ్రావణమాసంలో ఆరుణాచలం దర్శించు భక్తులకొరకు ఉయ్యూరు డిపో నుంచి ఈనెల 17న శనివారం రాత్రి 8 గంటలకు సూపర్ లగ్జరీబస్సు ఏర్పాటు చేసినట్టు డిపోమేనేజ ర్ కెఎస్ఆర్ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాణిపాకం, అద్దగిరి, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని 18న అరుణాచలంలో గిరిప్రదక్షణ, దర్శనం అనంతరం కాం చీపురం, తిరుత్తినిలో కొలువైన కుమారస్వామి దర్శనం, శ్రీకాళహస్తిలో వాయులింగేశ్వ రస్వామి తరువాత ఉయ్యూరు చేరుతుందని తెలిపారు. రిజర్వేషన్ సౌకర్యం కలదని, ఒక్కొక్కరికి చార్జి రూ. 3 వేలు, వివరాలకు 7382893468, 8919366868 సెల్ నంబర్లకు ఫోన్చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

- రూ.8 లక్షల జరిమానా

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం చిన్నాపురం సెక్షన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల గృహాలు, ఆక్వా చెరువులపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ విజిలెన్స్ దాడులలో ఈఈ విజయవాడ కె.వెంకటేశ్వర్లు, మచిలీపట్నం ఆపరేషన్ ఈ ఈ ఎం.భాస్కరరావు ఆధ్వర్యంలో చిన్నాపురం సెక్షన్ పరిధిలో విజిలెన్స్, ఆపరేషన్ సిబ్బంది 36 బందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గహవాసరాల సర్వీసులు 1462, ఆక్వా సర్వీస్‌లు 130, ఇతర విభాగాలకు చెందిన సర్వీసులు 50 మొత్తానికి కలిపి 1670 సర్వీసులు తనిఖీ చేయగా 123 సర్వీసులు అనధికారికంగా అదనపు లోడ్ వినియోగించు చున్నందున 8 లక్షల రూపాయలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈ ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా విద్యుత్ చౌర్యం చేస్తుంటే నెంబర్లు 9440812362, 9440812363, 8331014951 కు సమాచారం అందజేయాలని కోరారు. ఈ తనిఖీల్లో మచిలీపట్నం రూరల్ డి ఈ ఈ ఎం.శ్రీనివాసులు, చిన్నాపురం సెక్షన్ ఏ.ఈ.ఈ జి.బసవశాస్త్రులు, మచిలీపట్నం డివిజన్ పరిధిలోని ఇంజినీరింగ్ అధికారులు మరియు లైన్ ఇన్స్పెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యూరు రూరల్ ఎస్ఐగా సురేశ్ బాబు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు రూరల్ ఎస్సైగా కొండపల్లి సురేశ్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కోనసీమ అంబేద్కర్ జిల్లా రామచంద్రాపురం నుంచి బదిలీపై ఉయ్యూరు రూరల్‌కు రాగా ఇక్కడ పని చేస్తున్న అవినాష్ పామర్రుకు బదిలీపై వెళ్లారు.

జూదరుల అరెస్టు : ముదునూరు శివారు పొలాల్లో పేకాట శిబిరంపై బుధవారం దాడిచేసి పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.41,200 నగదు స్వాధీన పరుచు కున్నట్టు రూరల్ స్టేషన్ రైటర్ నాగరాజు తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్టు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోడూరు వెళ్లే రోడ్డు వద్ద బెల్టు షాపులో అమ్ముకోవడానికి మద్యం తీసుకు వెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద 8 మద్యం కోటర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అవనిగడ్డ ఎస్సై కే శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రవాణా చేసిన అమ్మిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై చెప్పారు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పరేడ్ రిహార్సల్స్ పరిశీలన

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నంలోని ఏఆర్ పోలీస్ పేరడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పరేడ్ రిహార్సల్స్‌ను జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు పోలీస్ అధికారు లతో కలిసి వీక్షించారు. పెరేడ్ కమాండర్గా ఆర్ఐ సతీష్ కుమార్ వ్యవహరించగా, ఎస్పీ ఇతర అధికారులతో కలిసి పరిశీలన వాహనంపై నుండి పరేడ్ రిహార్సల్స్ కవాతును పరిశీలించారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సివిల్, ఎఆర్, డాగ్ స్క్వాడ్, హెూంగార్డ్సు , ఎన్ సి సి , స్కౌట్ విద్యార్థులు చాలా చక్కటి టర్నవుట్‌తో పరేడ్ రిహార్సల్స్ బాగా చేశారని పెరేడ్‌పై సంతప్తి వ్యక్తపరిచారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సంధర్భంగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గురువారం జరిగే వేడుకలకు ఎలాంటి అవాంతరాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



పరేడ్ రిహార్సల్స్ కవాతును పరిశీలిస్తున్న ఎస్పి గంగాధరరావు

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కార్మికురాలు మృతి

– 8 మంది కార్మికులకు తీవ్ర గాయాలు



మృతిచెందిన పుల్లమ్మ



ఆస్పత్రి వద్ద మాట్లాడుతున్న కళ్యాణ్

ప్రజాశక్తి - ఎ.కొండూరు, మైలవరం : కూలీల ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో మహిళ చెందిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మరో 8 మంది కూలీలకు గాయాల య్యాయి. ఎ.కొండూరు పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం చీమలపాడు దళితవాడుకు చెందిన వ్యవసాయ కార్మికులు ఆటోలో పత్తి పంట కూలి పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఇబ్రహీంపట్నం-జగదల్పూర్ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా ఢీకొంది. దీంతో ఆటో ఉన్న మొక్కల కత్తి పుల్లమ్మ (54) అక్కడికక్కడే దుర్మరణం చెందగా 8 మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మైలవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నట్లు ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపారు. వీరిలో కొంతమంది పరిస్థితి విషమంగా మారడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. సమాచారం తెలుసుకున్న తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు హుటాహుటిన సంఘటనా స్థలాన్ని చేరుకొని ప్రమాదానికి గల కారణాలను ఎస్ఐ.చల్లా కృష్ణను అడిగి తెలుసుకున్నారు. అక్కడినుండి మైలవరం ఏరియా ఆసుపత్రికి వెళ్ళి క్షతగాత్రులను పరామర్శించి, బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట తిరువూరు నియోజకవర్గ ఏఎంసీ మాజీ చైర్మన్ అలవాల రమేష్ రెడ్డి, సర్పంచ్ మోర్ల లక్ష్మీ సాంబశివరావు, మాజీ సర్పంచ్ మొక్కల కత్తి రాములమ్మ, ఆనందరావు, మాజీ ఎంపీటీసీ మొక్కలకత్తి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి : వ్యకాసం

మృతిచెందిన మొక్కలకత్తి పుల్లమ్మ (65) కుటుంబానికి రూ.20 లక్షలు, తీవ్రగాయాలైన వ్యవసాయ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చీమలపాడు సమీపంలో తిరువూరు నుండి అతివేగంగా వస్తున్న టాటా ఏసీ వాహనం ఎదురుగా కూలీ లతో ఆటోని ఢీకొట్టడంతో పుల్లమ్మ మతిచెందగా 10 మంది కూలీలకు తీవ్రగా యాలయ్యాయి. ప్రమాదం జరిగిన సంఘటనను కళ్యాణ్ పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యులను, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను పరార్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆనందరావు, సిఐటియు జిల్లా నాయకులు చాట్ల సుధాకర్, రావూరి రమేష్ ఇస్సాకు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : టిడిపి నాయకుడు బుద్దా వెంకన్న పుట్టిన రోజు సందర్భంగా బ్యానర్ కడుతూ మృతి చెందిన ఏనుగుతల అప్పల నాయుడు కుటుం బానికి బుద్దా రూ. 2లక్షలు ఆర్థిక సాయం అంద జేశారు. ఉండవల్లి అమరావతి కర్రకట్టపై బ్యానర్లు కడుతూ విద్యుద్ఘాతానికి గురై విజయవాడ భానునగర్‌కు చెందిన అప్పలనాయుడు ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం అప్పలనాయుడు పెద్ద కర్మ సందర్భంగా కార్యక్రమానికి రూ.25వేలు, ఆర్థికసాయంగా రూ.2లక్షల నగదు అందజేశారు.

వేద పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి సంబం ధించి పోరంకిలో ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం విజయవాడ వారి స్మార్త వేద పాఠశాలను రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్, కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్ రామారావు, ఈఈ లింగం రమాదేవితో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ వారు విద్యార్థులతో మాట్లాడి, వేద పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న ఆహారం, తాగునీరు, వేద విద్య, వసతులు, శానిటేషన్ మొదలగు ఏర్పాట్లు పరిశీలించి, విద్యార్థులను అడిగి పాఠశాల గురించి అభిప్రాయాలు స్వీకరించారు. అనంతరం వీరు ఆలయ ఇఒ, ఇఇ ఎల్.రమ, ఇంజినీరింగ్ అధికారులు, వైదిక సిబ్బంది ఆర్.శ్రీనివాస శాస్త్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బందితో కలిసి వేదపాఠశాలను పరిశీలించారు.

కెబిఎన్ కార్యదర్శి తూనికుంట్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యా, ఆధ్యాత్మిక, సామాజిక సేవా రంగాలలో కెబిఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అందిస్తున్న సేవలు అపూర్వమని ఎపి ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు పెనుగొండ సుబ్బరాయుడు అన్నారు. కెబిఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసుకు విద్యారంగంలో అందించిన సేవలకు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ అమెరికా గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా తూనికుంట్ల శ్రీనివాసుకు కళాశాల సిబ్బంది ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెనుగొండ సుబ్బరాయుడు మాట్లాడుతూ కెబిఎన్ కళాశాల పాలకవర్గంలో గడిచిన 25 సంవత్సరాలుగా తూనికుంట్ల శ్రీనివాసు విశేష సేవలందిస్తున్నారన్నారు. ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాల ఛైర్మన్‌గా, గొల్లపూడి అయ్యప్పస్వామి దేవస్థానం, వాసవి విజయవాడ, అర్బన్ ఆర్యవైశ్య సంఘం, చైతన్య తపోవన్ వంటి అనేక సంస్థలకు ట్రస్టీగా వివిధ హోదాల్లో సేవలందించారన్నారు. ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షులు టి.శేషయ్య మాట్లాడుతూ శతాబ్దానికి పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో అనేక విద్యాసంస్థలు అద్భుతమైన ప్రగతిని సాధిస్తున్నాయన్నారు. మినర్వా హోటల్స్ అధినేత మాజేటి



తూనికుంట్ల దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

సురేంద్రనాథ్ మాట్లాడుతూ తూనికుంట్ల శ్రీనివాసు వివిధ రంగాల్లో చక్కని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో హిందూహైస్కూల్స్ కమిటీ ప్రముఖులు గోళ్ల బాబావిజయకుమార్, అన్నం రామకష్ణారావు, చిట్టూరి ఆనందసుధాకర్, శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం మాజీ ఛైర్మన్ కాజా మోహనరావు, పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు, చిట్టా అమర్‌సుధీర్, కేబీఎన్ కళాశాల అధ్యక్షులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, కోశాధికారి హరగోపాల్ హిందూహైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, కెబిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టార్ జి.కృష్ణవేణి తదితరులు ప్రసంగించారు.

మాజీ కార్పొరేటర్ మృతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు, 38వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొణపర్తి వెంకటేశ్వరరావు బుధవారం అకాల మరణం చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), ఉత్తరాంధ్ర ఇన్చార్జి. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, కార్యనిర్వహ కార్య దర్శి ఎం.ఎస్. బేగ్, 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) కొణపర్తి వెంకటేశ్వరరావు భౌతిక దేహాన్ని సంద ర్శించి, పూల మాలవేసి నివాళులర్పిం చారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని బుద్దా వెంకన్న తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



నివాళులర్పిస్తున్న ఎంపి చిన్ని, బుద్ధా, బేగ్

పలుచోట్ల హర్ ఘర్ తిరంగా ర్యాలీలు



వన్‌టౌన్ ర్యాలీలో పాల్గొన్న ఎంపి, ఎంఎల్ఎ

ప్రధాని పిలుపుమేరకు జిల్లాలో పలు చోట్ల హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. విద్యార్థులు, పలువురు అధికారులు, నాయకులు తదితరులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ సమైక్యతను చాటేలా ర్యాలీలో జాతీయ జెండాతో ప్రదర్శనలు నిర్వహించారు.

వన్‌టౌన్ : స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం విద్యాధరపురంలోని లేబర్ కాలనీ గ్రౌండ్‌లో మూడు వేల మూడు వందల మూడు అడుగుల భారీ జాతీయ జెండా ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎంఎల్ఎ సుజనా చౌదరి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా డూండీ గణేష్ సేవాసమితి వారు మూడువేల మూడువందల మూడు అడుగుల జాతీయ జెండా ర్యాలిని నిర్వహించడం శుభపరిణామం అన్నారు. ఈ ర్యాలీ సితార సెంటర్, చిట్టినగర్, కొత్తపేట, కష్ణవేణి మార్కెట్ వరకు కొనసాగింది. వివిధ పాఠశాల విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో డూండీ గణేష్ సేవాసమితి నిర్వాహకులు డూండీ రాకేష్, దర్శి సుబ్బారావు, ముక్తేశ్వరరావు, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ గడ్డం రవి, పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ చలువాది మల్లికార్జునరావు, ఎన్టీఆర్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య, జనసేన నాయకులు తిరుపతి అనూష, తదితరులు పాల్గొన్నారు. **వన్‌టౌన్ :** తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎన్‌డిఎ కూటమి నాయకులను 48వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు పేరాబత్తుల రమణ ఘనంగా స్వాగతించి సత్కరించారు. బుధవారం తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎన్‌డిఎ కూటమి నాయకులకు రమణ ఘన స్వాగతం పలికి వారిని శాలువాలతో సత్కరించారు. ర్యాలీ కార్యక్రమం సందర్భంగా చిట్టినగర్ సెంటర్లో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు వై.సుజనా చౌదరి, మాజీ ఎమ్మెల్సీ బుద్ద వెంకన్న, మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా తదితరులను పేరాబత్తుల రమణ సత్కరించారు. **జగ్గయ్యపేట:** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని పలు పాఠశాల విద్యార్థులతో తిరంగా యాత్ర నిర్వహించారు. జాతీయ జెండాను చేత పట్టి పట్టణంలో పలు వీధుల్లో యాత్రలు నిర్వహించి అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య విచ్చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునరావు, ఎమ్మార్వో నాగరాజు, టౌన్ ఎస్ఐ పద్మారావు ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, పలు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు. పట్టణంలో జరిగిన ర్యాలీలో విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు 150 అడుగుల జాతీయ జెండాను చేతబూని పాల్గొన్నారు. చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో గ్రామంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి ఎం.రమేష్ బాబు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించగా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో వై.వెంకటేశ్వర్లు పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు జాతీయ జెండాలు చేతబట్టుకుని ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. **విస్సన్నపేట :** 78వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక విసన్నపేటలో భారీ జాతీయ పతాకంతో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి సుధాకర్ మండల అధికారులు తహశీల్దార్ లక్ష్మీ కళ్యాణి ఎంపిడిఒ వెంకటరమణ ఇఒపిఆర్‌డి ఝాన్సీ లక్ష్మి ఎంపిపి పిల్లి మెర్సీ వనజాక్షి పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు. **విజయవాడ :** సత్యనారాయణపురంలోని ఏకేటిపిఎంసి ఉన్నత పాఠశాలలో గల విద్యార్థులతో తిరంగా రన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ టు కమిషనర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంగిశెట్టి శ్రీనివాసరావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ డా.మామిడి శ్రీనివాసరావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. **మైలవరం :** మైలవరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. విద్యార్థులు జెండాలు చేత పట్టుకొని ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. **కంచికచర్ల :** పరిటాలతో పాటు కంచికచర్లలో భారీ తిరంగ ర్యాలీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పరిటాల గ్రామంలో ఆర్డిఓ రవీంద్ర రావు, ఎంపిడిఒ కానూరి శిల్ప, డిప్యూటీ తహశీల్దార్ నాగుల్ మీరా, ఇఒపిఆర్‌డి శ్రీనివాస రావు తదితరులు జాతీయ జెండా చేతబూని విద్యార్థులతో కలిసి పురవీధుల్లో భారీ తిరంగా జెండా ర్యాలీ నిర్వహించారు. కంచికచర్ల పరిటాల గ్రామాలలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఆర్‌డిఒ రవీంద్రరావు జాతీయ జెండా చేతబూని ర్యాలీని ముందుకి నడిపించారు.



ఇబ్రహీంపట్నంలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గొంతెండుతోంది... తాగునీరివ్వండి...

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణంలోని సాయిబాబా కళ్యాణ మండపం ప్రాంతంలో నెల రోజుల నుండి నగర పంచాయతీ సరఫరా చేసే తాగునీరు నిలిచిపోవడంతో ప్రజలు దాహంతో అలమటిస్తున్నారు. వారం రోజుల నుండి వేసవిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలకు అల్లాడుతున్నారు. మంచి నీళ్ళు ఎప్పుడు ఇస్తారని వాటర్ సప్లయ్ కార్మికులను అడిగితే పైపులు పగిలాయి, రిపేరు చేసిన తర్వాత వస్తాయని చెబుతున్నారని పలువురు మహిళలు తెలిపారు. కుళాయి నీళ్ళు వచ్చే వరకైనా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తే ఎండుతున్న గొంతైనైనా తడుపుకుంటా మని అవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస మౌలిక సదుపాయం అయిన మంచినీటిని అందించలేని దుస్థితిలో నగర పంచాయతీ పాలక పక్షం ఉందా అని ప్రశ్నిస్తున్నారు. ఇదే తాగునీరు సమస్య సాయిబాబా కళ్యాణ మండపం ఏరియాకే పరిమితం కాలేదు. శాంతినగర్, అశోక్ నగర్, కుమ్మరు బజారు, సాయిరాఘవ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో కూడా తాగునీటి సమస్య జఠిలంగా ఉంది. తాగునీటి సరఫరా నిలిచిపోవడానికి ప్రధానకారణం కట్టలేరు వాగు పంగనామాల దగ్గర నుండి తాగునీటి సరఫరా అవుతున్న పైపు లైన్లు పగిలి పోవటమే... గత ఆరు నెలల కాలంలో పలుమార్లు వేసిన పైప్ లైన్‌లు నాణ్యత లోపం కారణంగా పగిలిపోతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన పగిలిపోయిన పైపులైన్లను మరమ్మతులు చేయించి తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఈ-పంటల నమోదు పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సునీల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కౌతావరం గ్రామంలో జరుగుతున్న ఈ -పంట నమోదును మండల వ్యవసాయ శాఖ అధికారి లోయ సునిల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఖరీఫ్-2024 పంట కాలంలో సాగు పంట పూర్తి వివరాలు పంట రకంతో సహా రైతులు వివరంగా రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా ఈ-పంట లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కొత్త వరి వంగడాలను సాగు చేసే రైతులకు ధాన్యం సేకరణ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండడానికి ఈ-పంట నమోదు సమయంలోనే వరి రకం వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియచేయాలని తెలిపారు. ధాన్యం సేకరణ, అకాల వర్షాల వల్ల పంటకు వాటిల్లిన సందర్భంగా ఇన్పుట్ సబ్సిడీ, పంటల భీమా, పంట రుణాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు, రాయితీ తదితర అవసరాలకు ఈ-పంటను ప్రామాణికంగా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. కావున రైతులు నాట్లు వేసిన అనంతరం ఎదజల్లిన ఆయా రైతు సేవా కేంద్రం గ్రామ వ్యవసాయ సహయకులను సంప్రదించాలని తెలిపారు. గుడ్లవల్లేరు మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ-పంటలో సాగు వివరాలు నమోదు చేయడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఏఏ లు గ్రామ రైతులు పాల్గొన్నారు..

తహాశీల్దారుకు సత్కారం

ప్రజాశక్తి-చల్లపల్లి : నిజాయితీ, నిర్భయంతో విధులు నిర్వహించిన వనజాక్షి చల్లపల్లి తహసీల్దారుగా నియమితులు కావటం శుభ పరిణామం అని జనసేన సీనియర్ నాయకులు జీవీ తాతారావు అన్నారు. బుధవారం చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నూతన తహసీల్దార్ డీ.వనజాక్షిని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు బొందలపాటి వీరబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ మండల ప్రజలకు కూడా ఉత్తమ సేవలు అందించి మరింత ఖ్యాతి, అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోట మురళీకష్ణ, ఆకుల కనకదుర్గ, కార్యదర్శి గోళ్ళ ప్రసాదు, సోమిశెట్టి రాఘువేంద్రరావు, పసుపులేటి రవికుమార్, బొందలపాటి సాంబశివరావు, అడపా రవి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌తో ఉద్యోగావకాశాలు పుష్కలం

- కెయు ఉపకులపతి ఆచార్య ఆర్. శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు పుష్కలం గా వుంటాయని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్. శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులకు తాము ఎంపిక చేసుకునే విభాగం గురించి పూర్తి అవగాహన కలిగి ఉంటేనే రాణించగలరు అని చెప్పారు. తొంభై శాతం మార్కులు సాధిస్తేనే ఇంజినీరింగ్ విద్యార్థి కి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది అని అన్నారు. రెక్టార్ ఆచార్య ఎంవి బసవేశ్వర రావు మాట్లాడుతూ కష్టపడకుండా ఫలితం ఆశించ కూడదన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్‌బాబు మాట్లా డుతూ జిల్లాలో ప్రతిష్టాత్మకమైన కష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో సీటు పొందిన విద్యార్థులను అభినందించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్ర మంలో డీన్ ఆచార్య వైకే సుందర కష్ణ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపకులపతి ఆచార్య ఆర్. శ్రీనివాసరావు

కేరళ విపత్తు బాధితులకు సెయింట్ జాన్స్ విద్యార్థుల విరాళం



చెక్కు అందజేస్తోన్న సెయింట్ జాన్స్ విద్యార్థులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : గత నెలలో కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో సంభవించిన వరద బీభత్సానికి అతలాకుతలమైన వయనాడ్ ప్రాంత బాధిత కుటుం బాలకు మండలంలోని సెయింట్ జాన్స్ చిన్నారులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం కలిసి 50000 వేల రూపాయలు సేకరించారు. సేకరించిన నిధులను సీఎం సహాయనిధికి పంపించినట్లు డైరెక్టర్ సాబుజాన్ తెలిపారు. ఈ సందర్భంగా బాధితులకు అండగా నిలిచిన విద్యార్థులను డైరెక్టర్ సాబుజాన్, ప్రధాన ఉపా ధ్యాయుని ఝాన్సీ అభినందించారు. ఆపదలో ఉన్న వా రిని ఆదుకోవడం విద్యార్థి దశ నుండి అలవ ర్చు కోవడం మంచి పరిణామం వారు విద్యార్థులను కొనియాడారు.



తోట్లవల్లూరు పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : కృష్ణాజిల్లా వైద్యాధికారిని జి.గీతాబాయి బుధవారం తోటవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వార్డు, ఫార్మసీ ఓపి రక్త పరీక్షల భాగమును పరిశీలించారు. ఇటీవల హాస్పిటల్‌లో తొలి కాన్పు నార్మల్ డెలివరీ అయిన చాగంటిపాడుకు చెందిన బాలింతను పరామర్శించి పుట్టిన బిడ్డను పరిశీలించారు. తొలి కాన్పు అయినప్పటికీ నార్మల్గా డెలివరీ చేసిన వైద్యాధికారిని టి. సాయి ప్రసన్నను అభినందించారు. హాస్పిటల్ ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉంచినందుకు, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందిస్తున్నందుకు, సమయపాలన పాటిస్తున్నందుకు ఆసుపత్రి సిబ్బందిని గీతాబాయి అభినందించారు.



ప్యూరిఫైయర్ మిషన్ బహూకరిస్తున్న వి.శ్రీనివాస్

వాటర్ ప్యూరిఫయర్ బహూకరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ సెయింట్ ఆన్స్ వైద్యశాలకు మంచినీటి పైపులైను పరిశుభ్రమైన తాగునీటి కోసం ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్ మిషన్ బహుకరించారు. బుధవారం వైద్యశాల వద్ద జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ చేతుల మీదుగా వీటిని ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వైద్యశాల అడ్మినిస్ట్రేటర్ సిస్టర్ వలస మాథ్యూ మాట్లాడుతూ శ్రీనివాస్ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆసుపత్రిలో మంచి నీటి సదుపాయం లేక రోగులు వారి బంధువులు పడుతున్న ఇబ్బందులను ఆసుపత్రి యాజమాన్యం శ్రీనివాస్ దష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన సోదరుడు విక్కుర్తి రాంబాబు సమస్య గురించి చర్చించి ఆసుపత్రి తరుపున కంచర్ల కోటేశ్వరరావు సహకారంతో మంచినీటి పైపులైను ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్ మిషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రి యాజమాన్యం కోరిక మేరకు కొత్త మంచినీటి పైపులైను, మినీ ఆర్వో వాటర్ ప్లాంట్ లు ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుపీరి యర్ సిస్టర్ మో లి థామస్, సిస్టర్ డాక్టర్ స్మిత జోష్, సిస్టర్ సిస్టర్ జిబి జోసెఫ్, సిస్టర్ శాంతి, ఫ్రాన్సిస్, పులిగడ్డ చంద్ర పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో సేవింగ్స్ స్కీమ్‌లు సద్వినియోగం చేసుకోవాలి

హెడ్ పోస్ట్ ఆఫీస్ మేనేజర్ ఫణి ప్రసాద్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పోస్టాఫీసుల్లో సేవింగ్స్ స్కీమ్ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో కొత్త పథకాన్ని ప్రకటించిందని విజయవాడ హెడ్ పోస్ట్ ఆఫీస్ సీనియర్ పోస్ట్ మేనేజర్ రావూరి ఫణి ప్రసాద్ తెలిపారు. బుధవారం కొత్తపేటలో గల పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఐసీసీ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ ఏ. రమాదేవి అధ్యక్షతన మహిళలకు "పోస్ట్ ఆఫీస్- వివిధ సేవింగ్స్ స్కీమ్స్" అంశం పైన సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విజయవాడ హెడ్ పోస్ట్ ఆఫీస్ సీనియర్ పోస్ట్ మేనేజర్ రావూరి ఫణి ప్రసాద్ మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్‌ల్లో సేవింగ్స్ ఖాతా, రికరింగ్ డిపాజిట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య సమద్ధి యోజన, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్స్ లాంటి పథకాల ప్రయోజనాలు వివరించారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం వీరపనేని గూడెం పారిశ్రామిక వాడ స్థలాల్లో, అటవీ శాఖ భూమిలో అక్రమ క్వారీ తవ్వకాలు జరుగుతున్నాయి. అర్ధరాత్రి వేళలో ప్రోక్లైన్ పెట్టి ట్రాక్టర్లతో గ్రావెల్‌ను ఊరు బయటకు తరలిస్తున్నారు. కొంతమంది వ్యక్తులు జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వం క్వారీ తవ్వకాలు నిలుపు దల చేసిన తరుణంలో, వీరపనేని గూడెం గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి కుమారుడు ఈ అక్రమ తవ్వకాలకు తెరతీసాడని గ్రామస్తులు చెబుతున్నారు. వీరపనేనిగూడెం పరిధిలోని ఇటుక బట్టీల వద్ద ఉన్న పొలాన్ని ఓ వ్యక్తి ఇటీవల కొనుగోలు చేశాడు. దానిని గ్రావెల్ తో నింపుతున్నారు. గ్రామంలోని వైసీపీకి చెందిన ఓ వ్యక్తి కాంట్రాక్టు కుదుర్చుకుని రాత్రి వేళల్లో గ్రావెల్ తవ్వకాలు చేపట్టారని తెలిసింది. ఏపీఐఐసీ భూములతో పాటు అటవీ శాఖకు చెందిన భూమిలో గ్రావెల్ ను తోడేస్తున్నారు. రెండు రోజుల క్రితం అటవీ శాఖ గార్డులు ట్రాక్టర్లను పట్టుకొని డబ్బులు తీసుకుని వదిలేసారని గ్రామస్తులు చెబుతున్నారు. మొన్నటివరకు గ్రామంలోని చెరువులో నల్ల మట్టిని అమ్ముకొని లక్షలు గడించారు. అంతా అక్రమంగానే జరిగింది. గ్రామంలోని వైసీపీ నాయకులే ఈ వ్యవహారం నడిపించారని స్థానికులు చెబుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన ఉపయోగం లేకుండా పోయింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మట్టి తవ్వకాలు, గ్రావెల్ తవ్వకాలు నిలిపివేసింది. అయితే ఓ వ్యక్తి ఒక పథకం ప్రకారం అర్ధరాత్రి గ్రావెల్ ను తరలిస్తున్నాడు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు కూడా తెలుసు అనే వాదన ఉంది. రెవెన్యూ కార్యాల యంలో ఓ అధికారిని మేనేజ్ చేసుకుంటూ ఈ తవ్వకాలు చేస్తున్నారట. అందుగ్గాను అధికారికి వాటా ఇస్తున్నారానే విమర్శ ఉంది. లేదంటే కనీసం గ్రామస్థాయి రెవెన్యూ అధికారులైన ఈ తవ్వకాలను నిరుపదల చేయాలి. ఆ పని మాత్రం జరగడం లేదు. దీని వెనుక ఎవరు ఉన్నారనేది అందరికీ తెలుసు. ఈ అక్రమ క్వారీయింగ్‌పై ఏపీఐఐసీ, రెవెన్యూ ఉన్నత అధికారులు నిఘా పెట్టాలని అంటున్నారు. ఇక్కడ గ్రావెల్ వీరపనేనిగూడెం, తెంపల్లి పరిసర ప్రాంతాల్లోకి వెళ్లిపోతుంది. ఖాళీ స్థలాలు నింపేస్తున్నారు. కాస్కో నా రాజా.. ఇది అక్రమ తవ్వకాల కథ. మిగతాది..సందీట్లో లో సడే మియా అన్నట్లుతెంపల్లి శివారు బల్లి పరు వంతెన వద్ద పోలవరం మట్టిని తవ్వేస్తున్నారు.



అంగన్వాడీ కేంద్రంలో 'అమ్మకు వందనం '

ప్రజాశక్తి - విస్సన్నపేట : తిరువూరు ప్రాజెక్టు పరిధిలో స్థానిక విసన్నపేటలోని నందేటివారి వీధిలో అంగన్వాడీ కేంద్రంలో అమ్మకు వందనం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలతో వారి తల్లిదండ్రులకు పుష్పగుచ్చాలతో వందనం చేయించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ శివకుమారి మాట్లాడుతూ చిన్న వయసు నుంచే తల్లిదండ్రులు పిల్లలకు సంస్కృతి సంప్రదాయాల పట్ల గురువులు పట్ల పెద్దలు పట్ల గౌరవ బుద్ధులు నేర్పించాలని కిశోర బాలికల తల్లిదండ్రులకు బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాల గురించి తెలిపారు. అనంతరం కిశోర బాలికల తల్లిదండ్రులు వారితో స్నేహ పూర్వకంగా మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు షేక్ బాజీ ఎ.చైతన్య భవానీ అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.ఎన్.శ్రీలక్ష్మి ఎన్ పద్మ జి.దుర్గాభవాని ఎం.వి.మహాలక్ష్మి కె.జమలమ్మ, బి.జ్యోతి వి.గోవర్ధన తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ సుశీలరావు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత కలిగిన నిరుద్యోగులకు డిస్ట్రిబ్యూటర్ సేల్స్ మ్యాన్, డొమెస్టిక్ బయోమెట్రిక్ డేటా ఆపరేటర్, కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. మూడు నెలల పాటు నిర్వహించబడే ఈ కోర్సులకు ఈనెల 20వ తేదీ నుంచి కళాశాలలోని స్కిల్ హబ్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని తరగతులకు హాజరు కావాలని చెప్పారు. వివరాలకోసం 6301534435, 9553315667 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు కేంద్రంలో ఎన్నికల సందర్భంగా బదిలీపై వెళ్లిన మండల అభివృద్ధి అధికారి అరుంధతి దేవి తిరిగి బుధవారం మండలంలో బాధ్యతలు చేపట్టారు. గ్రామపంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అరుంధతి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. కోరారు.

క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో ఆగస్టు 15 భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థినులకు అమరావతి బాలోత్సవం కమిటీ వారిచే వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, దేశభక్తి గీతాల పోటీ నిర్వహించారు. ప్రత్యేకంగా స్వాతంత్ర్యోద్యమ పోరాట చరిత్ర పైన, రాజ్యాంగం అంశాలపైన క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతి అంశంలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను మెరిట్ సర్టిఫికెట్స్‌లను జెండా వందన అనంతరం అందించను న్నట్లు, పోటీలలో పాల్గొన్న అందరికీ పార్టిసిపేట్ సర్టిఫికెట్‌లు అందిస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని తెలిపారు. 230 మంది విద్యార్థినులు వివిధ అంశాల్లో పాల్గొన్నారు.

31, 1 తేదీల్లో సహజ యోగా వర్క్‌షాప్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవేశపెట్టిన సహజయోగ ధ్యానంపై ఈ నెల 31, సెప్టెంబర్ 1న విజయవాడ వన్‌టౌన్‌లో సివిరెడ్డి చారిటీస్‌లో రెండు రోజులపాటు జాతీయస్థాయి వర్క్‌షాప్ ఏర్పాటు చేశామని సహజయోగ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ కో-ఆర్డినేటర్ కల్లూరు రామకృష్ణ, మహిళా కో-ఆర్డినేటర్ సుగ్గుల సుధారాణి, ఎన్టీఆర్ జిల్లా కో-ఆర్డినేటర్ యర్రంశెట్టి గాంధీ, విజయవాడ సిటీ కో-ఆర్డినేటర్ టి.రవీంద్రబాబు బుధవారం ఒ.సంయుక్త ప్రకటనలో తెలిపారు. 'నిర్మల్ ఇంటర్నేషనల్ లీడర్స్ అకాడమీ (నీలా) పేరుతో ఈ వర్క్‌షాపు ఏర్పాటు చేశామన్నారు. స్కిల్స్, నాలెడ్జ్, డిజైర్ లక్ష్యంగా ఈ వర్క్‌షాపు జరుగుతుందని వివరించారు. నిరంతరం సహజయోగ సాధన ద్వారా మనిషి శారీరక, మానసిక రుగ్మతలను మాయం చేసుకోవచ్చునని వారు తెలిపారు. సహజయోగ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 'ఇంటింటికీ సహజయోగం' వ్యాప్తి కోసం పలు కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 150 దేశాల్లో సహజయోగాన్ని ప్రజలు ఆచరిస్తున్నారన్నారు.

సిఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వై.వి.ఎల్.నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు టిడిపి నాయకులు సిఐని కలిసి సన్మానించారు.

డ్రైవింగ్ సర్టిఫికెట్లు అందజేత



విజయవాడ : లాజిస్టిక్స్ రంగంలో పెనుమార్పులు రాబోతున్నాయని, ఉపాధి కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బుధవారం సాయంత్రం కృష్ణాజిల్లా అంపాపురంలో కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ వారి మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటరులో 32 రోజులపాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తిచేసుకున్న 1072, 1073 బ్యాచ్‌ల ట్రైనీలకు, రక్తదాతలకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మౌలిక వసతులు లేని డ్రైవింగ్ స్కూళ్ల కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు. సభకు అధ్యక్షత వహించిన అధ్యక్షులు నాగుమోతు రాజా మాట్లాడుతూ తమ డ్రైవింగ్ స్కూలులో జులై 1 నుండి హెవీ వెహికల్ డ్రైవర్లకు ఒకరోజు రిఫ్రెషర్ ట్రైనింగ్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం ప్రారంభించామని, వచ్చే మార్చి 31 వరకు ఈ ఉచిత రిఫ్రెషర్ శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి. ఈశ్వరరావు, కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షులు కోనేరు వెంకటరమేష్ మాట్లాడారు. కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు కె.వి.రామారావు మాట్లాడుతూ సంఘ సభ్యులకే కాకుండా అన్ని వర్గాలకూ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు విస్తరించాయన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా లారీయాజమానుల సంఘం ఉపాధ్యక్షులు కె.వి.ఎస్.చలపతిరావు, కె.సత్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ, కార్యదర్శులు రావి శరత్ బాబు, కృష్ణా డిస్ట్రిక్ట్ ట్రైలర్స్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సూరపనేని సురేష్ పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

పెనుగంచిప్రోలు : స్థానిక గ్రామ పంచాయతీ చెత్త సంపద కేంద్రాన్ని బుధవారం జిల్లా పంచాయతీ అధికారి ఎన్.శివ ప్రసాద్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 298 గ్రామ పంచాయతీలుండగా 263 గ్రామ పంచాయతీల్లో మాత్రమే చెత్త సంపద కేంద్రాలున్నాయని తెలిపారు. 24 గ్రామ పంచాయతీల్లో సంపద కేంద్రాలు సక్రమంగా పని చెయ్యడం లేదని పేర్కొన్నారు. జిల్లాలో 3 దఫాలుగా అక్టోబర్ 2వ తేదీ నాటికి ఈ చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఒక లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు సంపద కేంద్రాలపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో పెనుగంచిప్రోలు గ్రామ చెత్త సంపద కేంద్రం ముందంజలో ఉందన్నారు. ఈ సంపద కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్న సర్పంచ్ వేల్పుల పద్మ కూమారిని అభినందించారు. అధికారులు మరొకసారి తడి, పోడి చెత్తలను వేరువేరుగా సేకరణపై సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, కార్యదర్శుల, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

వంద రోజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి : ఎంఎల్ఎ



ప్రజాశక్తి - విస్సన్నపేట : గ్రామ ఎంపిటిసిలు సర్పంచులు తీసుకొచ్చిన మండల సమస్యలను గూర్చి ప్రస్తావిస్తూ ప్రతి ఒక్క సమస్యను సాధ్యమైనంత త్వరగా ఒక ప్రణాళిక బద్ధంగా వంద రోజుల్లో పూర్తి చేద్దాం అని ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. విస్సన్నపేటలో స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపిపి పిల్లి మెర్సి వనజాక్షి ఆధ్వర్యంలో బుధవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులే కాక ప్రతి ఒక్క వ్యక్తి డ్రైన్లు పరిసరాలను శుభ్రపరచుకునే ఆలోచనతో వారు ఉండాలని అధికారులకు తోడ్పాటుగా ఉండాలని అన్నారు. ఈ సమస్యల్లో మేజర్‌గా అన్ని కులాల వారికి స్మశానవాటికలు సరైనవి లేవని తెలిపారు. తహశీల్దార్‌కి స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను కనుగొని ఈ సమస్యను పరిష్కరించాలని తెలిపారు. వచ్చిన వినతి పత్రాలు స్వీకరించి సంబంధిత అధికారులకు సర్పంచులకు ఎంపిటిసిలకు నాయకులకు అప్పగించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎంపిడిఒ తహశీల్దార్ ఎంపిపిలకు శాలువాలతో కొలికిపూడి ఘనంగా సత్కరించారు.



క్వారీ కార్మికుడు మృతికి నివాళి

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల శివారు దొనబండ రాతి క్వారీలో పనిచేస్తున్న ఒడిస్సాకు చెందిన కార్మికుడు బిసాల్ అజీత్ (35) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.మహేష్, ఎం.సోమేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చనిపోయిన కార్మికుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, సొంతిల్లు, ప్రభుత్వ పథకాలు కూడా ఆ కుటుంబానికి వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. పరిటాల ప్రాంతంలో వలస కార్మికులు క్వారీల్లో పని చేయడం జరుగుతుందని వారందరూ ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని కోరారు. దుర్గ, శివ, ఇస్సాకు, వల్లపు తిరుపతిరావు, కృష్ణ, సైదా, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - మైలవరం : ఒకరు ప్రమాదవశాత్తు జారిపడి, మరొకరు అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన కొదమసింహం సింధూర (32) మైలవరంలోని తమ్ముడు ఇంటికి వచ్చింది. గౌతమ్ స్కూల్ సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో 5వ అంతస్తు నుండి కాలు జారిపడి ప్రమాదవశాత్తు మృతి చెందింది. మరో ఘటనలో పటికల రాము అనారోగ్య సమస్యలతో రాజాపేటలో అద్దెకు ఉంటున్న ఇంటిలో ఫ్యానుకు ఉరేసుకొని మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా కట్టలేరు రహదారి



ప్రజాశక్తి - గంపలగూడెం : ఆ కట్టలేరు రాళ్ల రహదారిపై స్కూలుకు వెళ్ళొస్తున్న చిన్నారులు నడవలేక తూలుతున్నారు. గడిచిన మాసంలో కేవలం వారం రోజులు మాత్రమే ఆ రహదారిపై ప్రయాణం జరిగింది. ఎన్నిసార్లు అధికారులు, నాయకులు చొరవచూపి రహదారిని పునరుద్ధరించిన ఫలితం లేకుండా పోయింది. నిరంతర వర్షాల కారణంగా ఆ రహదారికి వేసిన రాళ్లు సూదుల్లా తేలడంతో, కాలి నడక సైతం సాగడం లేదు. ఈ రహదారి తప్పితే మరో 15 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి ఉన్నందున ఎంతటి కష్టానికి అయినా ఓర్చి రాళ్ళపై వెళ్లేందుకే మొగ్గు చూపుతున్నారు. సాధారణ ప్రయాణికుల పరిస్థితులు ఎలా ఉన్నా, స్కూలు విద్యార్థుల బాధ వర్ణించరానిది. ఒకవైపున ఎండ, మరోవైపున మోయలేనంత పుస్తకాల బరువు, దీనికి తోడు సూదుల్లాంటిరాళ్లపై నడవలేక చిన్నారులు తూలుతున్నారు. వంతెన అవతలి బాగాన పాఠశాల వాహనాలు నిలిపి, కాలినడకన వచ్చి పోతున్నారు. వంతెన శాశ్వత పరిష్కారం ఎలా ఉన్న, తాత్కాలిక పునరుద్ధరణ పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జోగిపై ఎంఎల్ఎ ఆగ్రహం

ప్రజాశక్తి - మైలవరం : అందితే జుట్టు అందకపోతే కాళ్లు పట్టుకోవడం జోగి రమేష్ నైజం అని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ విమర్శించారు. మైలవరంలో రక్తదాన శిబిరానికి వచ్చిన సందర్భంగా మాజీ మంత్రి జోగి రమేష్‌పై ఘాటుగా స్పందించారు. మైలవరం నియోజకవర్గంలో విద్యుత్తు సబ్ స్టేషన్‌లో 5 షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పించి రూ.35 లక్షలు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. జోగి రమేష్ కుమారుడు రాజీవ్ ఆరెస్టుతో కుల రాజకీయాలు చేస్తున్నారని, జోగి రమేష్ అమెరికాలో ఉన్న తన కుమారుడిని అధికారంలోకి రాగానే ఎందుకు పిలిపించారో చెప్పాలన్నారు. కావాలనే సిఐడి అటాచ్మెంట్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూములను కొనుగోలు చేసి సర్వే నెంబర్లు మార్చి వేరే వాళ్లకు విక్రయించి కొట్లాది రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. బీసీ కార్డును వాడుకుంటూ బీసీలనే దోచుకున్న వ్యక్తి జోగి రమేష్ అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం నిలిపేయాలని వినతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : వికలాంగులకు కేటాయించిన స్థలం కబ్జా కాకుండా చూడాలని, అక్రమ కట్టడం నిలుపుదల చేయించాలని బుధవారం ఇబ్రహీంపట్నం తహశీల్దారు వై.వెంకటేశ్వర్లుకు మండలంలోని వికలాంగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగులు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఆంజనేయ టవర్స్ పక్కన గల 14 సెంట్ల స్థలాన్ని సర్వే నెం.230/1 వికలాంగుల సంక్షేమం కోసం న్యూలైఫ్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ స్థలాన్ని న్యూ లైఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు జిఎస్ఆర్. స్వామి ఆక్రమించి కమిటీ సభ్యులకు తెలియకుండా అక్రమ నిర్మాణాలను చేపట్టాడని తెలిపారు. న్యూ లైఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ మెంబర్ షేక్.నగీన, కమిటీ మెంబెర్స్ 25 మందితో ఇబ్రహీంపట్నం మండలం తహశీల్దార్ వినతిపత్రం సమర్పించారు. ఈ స్థలంలో ఆక్రమణ కట్టడాన్ని నిలుపుదల చేసి కమిటీ సభ్యులకు అప్పగించాలని వారు కోరారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - మైలవరం : మనం దానం చేసే ప్రతి రక్తపు బొట్టు మరో ప్రాణాన్ని నిలబెడుతుందని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. గిరిజాల లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కోడూరు మనోజ్ కుమార్, మైలవరం లైన్స్ క్లబ్ అనుబంధంతో బుధవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపం ఆవరణలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నట్లు అవుతుందన్నారు. తరచుగా రక్తం ఇవ్వటం వల్ల కొత్త కణాల పెరుగుదలను ప్రోత్సహిస్తుందన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి వ్యక్తి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ నివత్తరావు, లైన్స్ క్లబ్ నెంబర్లు, లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



శిబిరం ప్రారంభించి మాట్లాడుతున్న ఎంఎల్ఎ

పలుచోట్ల హర్ ఘర్ తిరంగా ర్యాలీలు



బందరులో ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్, తదితరులు



గుడివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఎందరో త్యాగధనుల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం లభించిందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లా పర్యాటక, యువజన సంక్షేమ, క్రీడలు, విద్య శాఖల తోపాటు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మచిలీపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ సహకారంతో బుధవారం స్థానిక కోనేరు సెంటర్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రారంభించి, విద్యార్థులు అధికారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. మచిలీపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, నగరంలో వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. 365 అడుగుల జాతీయ జెండాను చేతపట్టి స్వాతంత్ర ఉద్యమ ఘటనను గుర్తుచేస్తూ దేశ సమగ్రతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, వందేమాతరం నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో శ్రీదేవి, జిల్లా పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్ ,స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఝాన్సీ లక్ష్మి, నెహ్రూ యువ కేంద్రం అధికారి సుంకర రాము, జిల్లా యువజన సంక్షేమ అధికారి డి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** స్వాతంత్రదినోత్సవ వేడుకలు పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం జయహో భారత్ తిరంగా ప్రదర్శన నిర్వహించి చిరువ్యాపారులకు, ప్రజలకు జాతీయ పతాకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జడ్పీస్కూల్ ఎన్సీసీ క్యాడెట్లు, విద్యార్థుల తో కలసి జాతీయ పతాకాలతో ప్రదర్శన చేశారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్ పర్సన్ ఎం డి ఇస్మాయిల్ పర్యవేక్షణలో జరిగిన ఈకార్యక్రమానికి క్లబ్ క్యాబినెట్ డిప్యూటీ సెక్రటరీ నూకల వెంకటసాంబశివరావు హాజరై ప్రదర్శనను జెండా ఊపి ప్రారంభించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం పిలుపుమేర కార్యక్రమం నిర్వహించి పౌరుల్లో దేశభక్తి పెంపొందించడం జాతి ఐక్యతను బలోపేతం చేయడం అవుతుందన్నారు. ప్రతిఒక్కరు వారి నివాసాలపై జాతీయ పతాకాలు ఎగురవేయాలన్న ఉద్దేశంతో పంపిణీ చేశామని ఇస్మాయిల్ అన్నారు. క్లబ్ కార్యదర్శి నెల్లి రాంబాబు, ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, నాం చారయ్య, హైస్కూల్ కమిటీ చైర్మన్ ఆరేపల్లి శివసాయి ప్రసాద్, ఎన్సీసీ ఇన్చార్జ్ జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** విద్యార్థినీ, విద్యార్థులకు దేశభక్తిని, జాతీయభావాన్ని నింపేందుకే హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమం అని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు అన్నారు. బాపులపాడు మండలం, రంగన్నగూడెం గ్రామంలో గ్రామ పంచాయతీ, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు 78 వ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా 78 అడుగుల భారీ మువ్వన్నెల జాతీయ జెండాను చేత పుచ్చుకుని హర్ ఘర్ తీరంగా యాత్రను గ్రామంలోని ప్రధాన వీధుల్లో నిర్వహించి దేశభక్తిని చాటారు. గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి, పిఏసీయస్ మాజీ అధ్యక్షులు తుమ్మల దశరథరామయ్య, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు నత్తా అబ్రహం, ఉపాధ్యక్షురాలు దేవర కొండ తిరుమల, ప్రధాన ఉపాధ్యాయురాలు ఆర్.గ్లోరీ స్వర్ణలత పాల్గొన్నారు. అలాగే గన్నవరంలోని ప్రధాన రహదా రులలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని నగరంలో 25 మీటర్ల పొడవు గల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు గన్న వరం శాఖ రవీంద్ర భారతి పాఠశాల ప్రధానో పాధ్యాయులు శ్రీకాకుళపు సుష్మ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వీరమాచినేని వంశీ మోహన్, జోనల్ ఇంచార్జ్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ :** తిరంగా రన్ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ప్రతి గ్రామంలో నిర్వహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం అవనిగడ్డ లోని ఎమ్మెల్యే స్వగహంలో అవనిగడ్డ పోస్ట్ ఆఫీస్ వారి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకొని జాతీయ పతాకాల విక్రయాల కార్యక్రమాన్ని బుద్ధ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింగళి వెంకయ్య జాతీయ పతాకాన్ని అందించడం మనకు గర్వకారణమని, ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ జాతీయ భావాలు కలిగి తమ ఇంటిపై దుకాణాలపై జాతీయ పతాకాలు ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్ట్ ఆఫీస్ అసిస్టెంట్ సూపర్డెంట్ టి నాగరాజు, సబ్ పోస్ట్ మాస్టర్ పోస్ట్మాన్లు ఎన్ నరేష్, ఏబీపీఎం కె నాగరాజు పాల్గొన్నారు **ప్రజాశక్తి - గుడివాడ :** పాఠశాల, కళాశాల విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 200 అడుగుల జాతీయ జెండాతో పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు ఎంపిడిఒగా స్వర్ణలత బాధ్యతలు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : తోట్లవల్లూరు ఎంపీడీవో గా టి.స్వర్ణలత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధులు నిర్వహించే నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేసి ఎన్నికల అనంతరం తిరిగి మండలానికి ఎంపీడీవో గా వచ్చిన స్వర్ణలతకు కార్యాలయ సిబ్బంది బుధవారం ఘనంగా స్వాగతం పలికారు. సూపరిండెంట్ ఉషారాణి, కార్యాలయ సిబ్బంది కార్యదర్శులు పునరాగమన స్వాగతం పలికారు.

అన్నక్యాంటీన్లు ప్రారంభించడం హర్షణీయం



ప్రజాశక్తి-కంకిపాడు : పట్టణ ప్రాంత నిరుపేదలు, వలస కార్మి కుల అన్నార్తిని దూరం చేయడమే లక్ష్యంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడు కల వేళ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్పో రేషన్లు, మునిసిపాలిటీలు పరిధిలో అన్నా క్యాంటిన్లును ప్రారంభించడం కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని కంకిపాడు మండల టిడిపి సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్ బాబు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న కొద్ది రోజుల్లో ఓ మోస్తరు పట్టణాలు, మండల కేంద్రాల్లో కూడా అన్నా క్యాంటిన్లు ప్రారంభించి మరింత మంది బడుగు బలహీన జీవుల ఆకలి తీరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం : ఎంపి



ప్రజాశక్తి-గన్నవరం : లాజిస్టిక్స్ రంగంలో పెను మార్పులు రాబోతున్నాయని, ఉపాధి కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. బుధవారం కష్ణాజిల్లా అంపాపురంలో కష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ వారి మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సందర్శించారు. ఈ సెంటరులో 32 రోజుల పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తిచేసుకున్న 1072, 1073 బ్యాచ్‌ల ట్రైనీలకు, రక్తదాతలకు సర్టిఫికెట్లు అందచేశారు. అనంతరం ఎం.పి.కేశినేని శివ నాథ్ మాట్లాడుతూ మౌలిక వసతులు లేని డ్రైవింగ్ స్కూళ్ల కట్టడికి చర్యలు తీసుకుంటా మన్నారు. డ్రైవర్ల వత్తి గౌరవప్రదంగా మారిందన్నారు. సభకు అధ్యక్షత వహించిన అధ్యక్షులు నాగుమోతు రాజా మాట్లాడుతూ తమ డ్రైవింగ్ స్కూలులో జులై 1 నుండి హెవీ వెహికల్ డ్రైవర్లకు ఒకరోజు రిఫ్రెషర్ ట్రైనింగ్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం ప్రారంభించామని, వచ్చే మార్చి 31 వరకు ఈ ఉచిత రిఫ్రెషర్ శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి. ఈశ్వరరావు, కష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షులు కోనేరు వెంకటరమేష్, కష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు కె.వి.రామారావు, కృష్ణాజిల్లా లారీయాజ మానుల సంఘం ఉపాధ్యక్షులు కె.వి.ఎస్.చలపతిరావు, కె.సత్యనా రాయణ రాజు, ప్రధానకార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనా రాయణ, కార్యదర్శులు రావి శరత్ బాబు పాల్గొన్నారు.

గుడివాడ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా పొట్లూరి, నిమ్మగడ్డలు ఏకగ్రీవం

ప్రజాశక్తి - గుడివాడ : ది గుడివాడ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ ఎలక్షన్ అధికారి పొట్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం స్థానిక ది గుడివాడ క్లబ్‌లో జరిగిన క్లబ్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పొట్లూరి వెంకటేశ్వరరావు, సెక్రటరీగా నిమ్మగడ్డ శివశకంర్, జాయింట్ సెక్రటరీగా విశ్వంశెట్టి కృష్ణకిషోర్, కోశాధికారిగా డాక్టర్ మాగంటి శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన పొట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా తోట వెంకట రాధాకృష్ణ, పొట్లూరి వెంకటకృష్ణారావు, పిన్నమనేని సాంబశివరావు, నర్రా శ్రీనివాసరావు, కఠారి వెంకటరమణ, ముప్పా శ్రీరామ పూజేశ్వరరావు, నెరుసు జయరామ్‌లను కూడ ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.



ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు : "ఎక్ పేడ్ మానే నామ్ " అంటే అమ్మ పేరుతో ఒక మొక్క అర్థం అని, ఆ పేరుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని తేలప్రోలు ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివిఎస్‌కెవి ప్రసాద్ అన్నారు. బుధవారం తేలప్రోలు ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం వారి ఆధ్వర్యంలో ఘనంగా 'ఎక్ పేడ్ మానే నామ్' అనే నినాదంతో మెగా క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక విద్యార్థి తల్లి పేరుతో ఒక మొక్క నాటాలని విద్యార్థులకు సూచించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణ, కాలుష్యం నియంత్రణ కల్మషం లేని ఆక్సిజన్ అందరికీ అందించడం మే కాకుండా మంచి ఆరోగ్య కరమైన ఫలాలను అందించవచ్చు అని అన్నారు. అనంతరం విద్యార్థులు కళాశాల ఆవరణలో, పొట్టి పాడు గ్రామంలో 125 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం,ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి శ్రీహరిబాబు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



కలువపాములలోఅవగాహన నిర్వహిస్తున్న దృశ్యం

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా బుధవారం ముదునూరు, కలవపాముల గ్రామాలలో ఎయిడ్స్ నియంత్రణపై ప్రదర్శన, పాఠశాల విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ పి.లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ హెచ్‌ఐవి, లైంగిగా సంక్రమించే అంటువ్యాధిపై సమాచారం అందించేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు రెండు నెలలపాటు నేకో నేతృత్వంలో 'మీకు తెలుసా' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలి పారు. సూపర్వైజర్ బి. రాకేశ్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా ఎదగాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : సమాజంలో విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే అందుకు క్రమశిక్షణ ఎంతో అవస రమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ హితవు పలికారు. బుధవారం ఎస్‌విఎల్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ ఆదేశిక సూత్రాలు ప్రాథమిక హక్కులు విధులు బాధ్యతలు తెలుసుకొని ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని సూచించారు. విద్య ద్వారా వినయము క్రమశిక్షణ లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సత్క రించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ ఉమామహేశ్వరరావును కూడా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'జయహో భారత్' పోటీలు

విజయవాడ : 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు జయహో భారత్... ప్రౌడ్ టు బి యాన్ ఇండియన్ ఆర్ట్ కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ వర్కింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో రీ క్రియేట్ త్రీడీ లైఫ్ కాస్టింగ్ సంస్థ వారి సమర్పణలో ఈ పోటీలుంటాయని పేర్కొన్నారు. 15వ (గురువారం) తేదీ, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు జరిగే బహుమతి ప్రదానం ఉంటుందన్నారు.

రావి ఆకుపై జాతీయ పతాకం



జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు టి.ప్రసాద్ బాబు 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులలో జాతీయత, సృజనాత్మకత పెంపోదించేందుకు వంద శాతం ఆక్సిజన్ ఇచ్చే ఎన్నో గొప్ప ఔషధ విలువలున్న రావి చెట్టు గొప్ప తనాన్ని పిల్లలకు తెలియజేయడానికి రావి ఆకుపై అక్రిలిక్ రంగులతో మదినిండా జాతీయ భావం నింపుకొని జాతీయ పతాకం తీర్చిదిద్దారు. ఈ చిత్రాన్ని పిల్లలకు చూపించి స్వాతంత్ర దినోత్సవం గురించి, జాతీయ పతాకం గొప్పతనాన్ని వివరించారు. పిల్లలు, తల్లిదండ్రులు, హెచ్.మ్. వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖధికారి యల్. చిట్టిబాబు తోటి ఉపాధ్యాయులు పి.ప్రసాద్ బాబుకు అభినందనలు తెలిపారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : మండలంలోని శనగపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.95 కోట్లతో నిర్మించిన నూతన భవనం, మౌలిక వసతుల కల్పన, అదనపు తరగతి గదులు ప్రారంభోత్సవాలను బుధవారం శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల్లో ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దానిని సాధించే దిశగా ప్రయత్నం చేస్తూ విద్యపైనే దృష్టి సారించాలని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యతోనే సమాజ అభివృద్ధి అని తెలిపారు. ప్రతీ ఒక్కరు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి ఎంజి విండర్స్ యుటిలిటీ వెహికల్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఎం.జి.విండర్స్ సంస్థ ఆధ్వర్యంలో క్రాస్ ఓవర్ యుటిలిటీ వెహికల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థరీజనల్ ప్రతినిధి కె.సాయికుమార్ తెలిపారు. నగరంలోని ఓహోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంగళవారం వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.జి.విండర్స్ ప్రత్యేకమైన ఫీచర్లతో ఏరో లౌంజ్ సీట్స్ సౌకర్యంతో సాటిలేని విలాసవంతంగా ఉండేందుకుగానూ అత్యాధునిక కారును మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.

వెలంపల్లి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వైసిపి జిల్లా అధ్యక్షులు వెలంపల్లి శ్రీనివాస రావు జన్మదినం సందర్భం గా బ్రాహ్మణ వీధిలోని వైసిపి కార్యాలయంలో వేడు కలు నిర్వహించారు. జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు ఎం.డి. చిచ్చా ఆధ్వర్యంలో వెలంపల్లిని సత్కరించారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య జన్మదిన కేక్ కట్ చేశారు. నాయకులు, శ్రీనివాసరావుకు కేక్ తినిపించి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.







అలరించిన ఆటపాట సాంస్కృతిక కళా సంబరాలు

- హోరెత్తించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు



ప్రజాశక్తి - అజిత్ సింగ్‌నగర్ : 78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా వివిధ ప్రజా సంఘాల సెంట్రల్ సిటీ కమిటీల ఆధ్వర్యాన బుధవారం రాత్రి విజయవాడ వాంబే కాలనీలో ఆటపాట సాంస్కృతిక కళా సంబరాలను ఘనంగా నిర్వహించారు. సిఐటియు డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ, ఐద్వా, పిఎన్ఎం, కెవిపిఎస్, మధ్యతరగతి ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన జరిగిన ఈ సంబరాల్లో కళాకారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆటపాటలో వివిధ కళారూపాలను ప్రదర్శించి అందరినీ ఉత్సాహపరిచారు. చిన్నారులు తమ ప్రతిభను చాటుకున్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు యువతీ యువకులు కూచిపూడి నత్యం, భరతనాట్యం, క్లాసికల్ డాన్స్, వెస్టన్ డాన్స్, కోలాటం, జానపద నృత్యాలు ప్రదర్శించారు. జానపద, సినీ గీతాలు ఆలపించారు. చిన్నారుల సాంస్కతిక ప్రదర్శనలున అందరినీ ఆకట్టుకున్నాయి. వాంబే కాలనీ పరిసర ప్రాంత్రాల విద్యార్థులు, యువతీ యువకులు ఈ ప్రదర్శనల్లో భాగస్వాములయ్యారు. ఆటపాట సాంస్కృతిక కళా సంబరాలలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు యువకులకు పౌర సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్, విజయవాడ నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ సిహెచ్.బాబూరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు ఎ.కమల, అధ్యక్షులు కె.దుర్గారావు, నాయకులు భూపతి రమణారావు, ప్రవీణ్, నిజాం, ఆషా తదితరులు పాల్గొన్నారు.











చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - తిరువూరు : సాతంత్ర్య దినోత్స వాన్ని పురస్కరించుకుని తిరువూరు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం విద్యార్థులకు జాతీయ నాయకుల చిత్ర లేఖన పోటీలు జరిగాయి. వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమలోని ప్రతిభను చిత్ర రూపంలో ప్రదర్శించారు. బాలోత్సవ కమిటీ సభ్యులు కడిమి పాపారావు, ధనసుందరరావు, మోహన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైద్య విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వైద్య శిబిరం పరిశీలన

ప్రజాశక్తి - గంపలగూడెం : గ్రామాల్లో ప్రధానంగా పారిశుధ్యాన్ని మెరుగుపరిస్తే సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చని మండల ప్రత్యేక అధికారి వెంకటనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని నెమలి, ఉమ్మడి దేవరపల్లి, కొనిజర్ల, ఊటుకూరు గ్రామాలు పర్యటించి, పరిశీలించారు. నెమలిలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న మెడికల్ క్యాంపు పరిశీలించి, సూచనలు చేశారు. లార్వా, సర్వేలను పరిశీలించి, వైద్య బృందానికి ప్రత్యేక వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.చెన్నయ్య, డాక్టర్ శిరీష, సురేష్, విస్తరణ అధికారి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షకు సమగ్ర టెస్ట్ ప్రిపరేషన్ సిరీస్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రముఖ అభ్యాస సంస్థ పియర్సన్, తమ కొత్త జెఈఈ అడ్వాన్స్‌డ్ పిసిఎం (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్) సిరీస్‌ను విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధి అనన్య. గంగూలీ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఇది పోటీతత్వ జెఈఈ మెయిన్, జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం అత్యంత జాగ్రత్తగా రూపొందించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం, 12 లక్షల మంది జెఇఇ మెయిన్స్, 2.5 లక్షల మంది అభ్యర్థులు జెఇఇ అడ్వాన్స్‌డ్‌లను ప్రయత్నిస్తారన్నారు. ఈ సమగ్ర పుస్తక శ్రేణితో, 11వ, 12వ, 13వ తరగతులు (రిపీటర్)కు చెందిన విద్యార్థులు, ఈ పోటీ పరీక్షలలో ప్రయత్నించి విజయం సాధించాలనుకునేవారికి సహాయం చేయాలని పియర్సన్ లక్ష్యంగా పెట్టుకుంది. రాజస్థాన్‌లోని కోటలో జరిగిన అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యా రంగంలోని ప్రముఖులు, పియర్సన్ జెఇఇ అడ్వాన్స్‌డ్ పిసిఎం సిరీస్ రచయితలు ఓం శర్మ, అనన్య గంగూలీ, రాహుల్ సర్దానా పాల్గొన్నారు.